క్లుప్తంగా

సీపీఐలో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన సుమారు 20కుటుంబాలు వివిధ పార్టీల నుంచి సీపీఐ పార్టీలో చేరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు వారికి కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు తొట్ల ప్రభాకర్, రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మూరగుండ్ల లక్ష్మయ్య, బత్తుల సుందరయ్య, వజం మల్లయ్య, బత్తుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బొమ్మగాని ధర్మభిక్షం జయంతి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం 101వ జయంతిని బుధవారం ఉదయం 10గంటలకు సూర్యాపేట పట్టణంలోని ధర్మభిక్షం చౌక్‌వద్ద నిర్వహించనున్నట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశాల గడువు పెంపు

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని ఇమాంపేట ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలకు ప్రవేశాల గడువును ఈనెల 22వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ శంకర్‌నాయక్ మంగళవారం తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్‌స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి వంద సీట్లు, 7, 8, 9, 10 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ప్రవేశపరీక్ష దరఖాస్తుకు ఈనెల 22వరకు గడువు పొడిగించినట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ వేముల బాలరాజు మంగళవారం తెలిపారు

చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

చివ్వెంల(సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలోని టీటీడీ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 12న నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీల్లో గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా అండర్-15 విభాగంలో బి.అఖిల్ నాయక్ తృతీయ స్థానం, అండర్-11 విభాగంలో ఎస్.రహుల్ ద్వితీయ స్థానం సాధించారు. దీంతో మంగళవారం విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ పుండరిక చారి, పీఈటీలు షేక్ రహీం, ధరావతు బాలు అభినందించారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

మద్దిరాల : మండల కేంద్రంలోని శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 17నుంచి 21వ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలలో భక్తులు పాల్గొన్ని విజయవంతం చేయాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను దేవాలయ కమిటీ చైర్మన్ ఎల్లు శివారెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అర్చకులు ఉన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దు

తిరుమలగిరి (తుంగతుర్తి) : విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా యోగా, ధ్యానం చేయాలని వైద్యాధికారి మల్లెల వందన తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో యోగా, ధ్యానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బిచ్చునాయక్, వెలుగు క్యాంపు డాక్టర్ వాసవి, స్వరూప, సంధ్యారాణి, శోభారాణి, సృజన పాల్గొన్నారు.

ఘనంగా చల్లా లక్ష్మీకాంత్ జన్మదినం



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న మంత్రి

సూర్యాపేట : పట్టణంలో ఇంటర్‌నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చల్లా లక్ష్మీకాంత్ పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి జగదీశ్ రెడ్డి హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేదలకు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదానం చేశారు. అనంతరం కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ నాయకులు గండూరి ప్రకాష్, ఉప్పల ఆనంద్, నెమ్మాది భిక్షం, శ్రీనివాస్, డాక్టర్ రామ్మూర్తియాదవ్, జ్యోతి కరుణాకర్, లవకుశ, రమేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ అస్తవ్యస్తం



తిరుమలగిరి చౌరస్తాలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్



రోడ్డుపైనే నిలిపిన ద్విచక్రవాహనాలు

- ప్రధాన కూడలిలో కానరాని సిగ్నల్స్, పోలీస్ సిబ్బంది
- రోడ్లపైనే నిలుపుతున్న ప్రైవేట్ వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : పట్టణాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, వ్యాపారులు పట్టణాలకు వివిధ పనుల నిమిత్తం అధికంగా వస్తుండడంతో మండల కేంద్రాల్లో ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతున్నాయి. తిరుమలగిరి మండల కేంద్రంలో జనగామ- సూర్యాపేట, వలిగొండ- తొర్రూరు రహదారులను కలుపుతూ నాలుగు ప్రధాన రహదారులు ఉన్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతుంది. సాయంత్రం నుంచి రాత్రి వరకు వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో స్థానిక తెలంగాణ చౌరస్తాలో ట్రాఫిక్ మరింతగా పెరుగుతుంది. ఈ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో పాటు పోలీసు సిబ్బంది కనిపించకపోవడంతో వాహనదారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తూ వాహనాలు నడుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య మరింతగా పెరుతుంది. అదేవిధంగా పట్టణంలోని రోడ్డు వెంట ఉన్న వ్యాపార సముదాయాల ఎదుట సరైన పార్కింగ్ లేకపోవడంతో ద్విచక్ర వాహనాలను ఎక్కడ ఖాళీగా స్థలం ఉంటే అక్కడ రోడ్లపైనే నిలిపి వేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ మరింత అంతరాయం ఏర్పడుతుంది. చిరు వ్యాపారులు సైతం రోడ్లపైనే వ్యాపారాలు చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతుంది. అదేవిధంగా పట్టణంలో బస్టాండ్ లేకపోవడంతో రోడ్డుపైనే బస్సులు నిలపడంతో ట్రాఫిక్ జామ్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనదారులు వాపోతున్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి

వ్యాపార పరంగా తిరుమలగిరి దినదినాభివృద్ధి చెందుతుండటంతో వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. చౌరస్తాలో నాలుగు రోడ్ల నుంచి ఒకేసారి వాహనాలు వస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే మంచిది.

– రమేష్, తిరుమలగిరి

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం



స్థానిక తెలంగాణ చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో సిబ్బందిని నియమిస్తాం. రోడ్లపై ద్విచక్ర వాహనాలు, ఆటోలు నిలిపితే జరిమానాలు విధిస్తాం. వాహనదారులు ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి.

– శివకుమార్, ఎస్ఐ, తిరుమలగిరి

సిగ్నల్స్ లేక ఇబ్బందులు..

స్థానిక తెలంగాణ చౌరస్తాలో నాలుగు ప్రధాన రహదారుల నుంచి భారీ వాహనాలు వస్తుండటంతో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో కొన్ని సమయాల్లో ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. దీనికి తోడు స్థానిక చౌరస్తాలో పోలీస్ సిబ్బందిని ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటు చేయకపోవడంతో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థానిక చౌరస్తాలో సిగ్నల్స్ ఏర్పాటు చేసి, పోలీసు సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే పాదయాత్ర

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి



పాదయాత్రలో మాట్లాడుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : తాను రాజకీయాల కోసం పాదయాత్ర చేయడం లేదని ప్రజల బాధలు, కష్టాలు, సమస్యలు తెలుసుకోవడం కోసం మాత్రమే పాదయాత్ర చేపట్టానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా చేపట్టిన పాదయాత్ర మంగళవారం సూర్యాపేట మండలంలోని బాలెంల గ్రామం నుంచి ఆరెగూడెం, పుల్లంవారిగూడెం గ్రామాల మీదుగా దాస్‌తండా వరకు పాదయాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయంలో తనకు ఎవరు గాడ్‌ఫాదర్ లేరని.. ప్రజలే నాకు గాడ్‌ఫాదర్ అని స్పష్టం చేశారు. పెద్ద కుటుంబంలో అతి సున్నితంగా పెరిగిన తాను ప్రజల సమస్యలు తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే పాదయాత్రను ప్రారంభించానని అన్నారు. వ్యవసాయానికి విద్యుత్ దేశంలోనే తాము 24గంటలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకునే మంత్రి 24గంటల విద్యుత్ ఇస్తున్నారా సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రుణమాఫీ చేయకుండా రైతులను ఆర్థికంగా ఇబ్బంది పెట్టడంతో పాటు విద్యుత్ వ్యవసాయానికి సక్రమంగా ఇవ్వకపోవడంతో రైతులు అయోమయానికి గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గట్టు శ్రీనివాస్, ముదిరెడ్డి రమణారెడ్డి, రామసాని రమేష్‌నాయుడు, మారేపల్లి ప్రభాకర్, ఆరేగూడెం, నాగరాజు, డాక్య, షఫిఉల్లా, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి, ఫరూక్, స్వామి, ఉపేందర్, శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ కోతను నివారించాలని రైతుల ధర్నా

ఆత్మకూర్ (ఎస్) : అప్రకటిత విద్యుత్ కోతను నివారించి రైతులకు 24గంటల విద్యుత్ వ్యవసాయానికి అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి దండా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ కోతలను నివారించి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా 24గంటలు విద్యుత్ ఇస్తానని చెప్పి నేటికీ ఆహామీ అమలు చేయలేకపోతుందని విమర్శించారు. విద్యుత్ కోతలను విధించడంతో లక్షల ఎకరాల్లో వరి పంట దెబ్బతిందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు అవిరే అప్పయ్య మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమిరెడ్డి దామోదర్‌రెడ్డి, దండ శ్రీనివాసరెడ్డి, విజయ్‌రెడ్డి, ఎరుకల నాగరాజు, మల్లయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

చివ్వెంల(సూర్యాపేట) : మండలంలో అభివృద్ధి పనులపై ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని ఎంపీపీ ధరావత్ కుమారి బాబునాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సమావేశంలో గ్రామాల్లోని పలు సమస్యలపై ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఎస్సారెస్పీ కాలువల కింద భూములు తీసుకుని ప్రస్తుతం ఉన్న పట్టాపాస్‌పుస్తకంలోంచి తీస్తున్నారని సభ దృష్టికి తీసుకురాగా స్పందించిన తహసీల్దార్ రంగారావు సమస్యను పరిష్కారిస్తామన్నారు. గ్రామ పంచాయతీల్లో తమ సంతకం లేకుండానే సర్పంచ్‌లు తీర్మాణాలు చేస్తున్నారని ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎంపీపీ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యుత్, పంచాయతీరాజ్, ఉద్యానవన, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు ఎజెండా వివరాలు అందించడంలో నిర్లక్ష్యం చేయడంతో వారిపై ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంతో ఎంపీఓ టి.గోపి, వ్యవసాయ అధికారి ఆశాకుమారి, వైద్యాధికారి గాయత్రి, ఏపీఎం రాంబాబు, ఏఈలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ పథకాన్ని వినియోగించుకోవాలి



ఆయుష్మాన్ భారత్ పథకం నమోదును ప్రారంభిస్తున్న రామచంద్రయ్య

నాగారం : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య అన్నారు. కడియం సోమక్క చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఉచిత ఈకేవైసీ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా పేద ప్రజలకు ఉచిత, మెరుగైన వైద్యం అందించేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తీసుకొచ్చారని అన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5లక్షల వరకు ఆరోగ్య బీమా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు చలిగంటి వీరేంద్ర, మల్లేపాక సాయిబాబు, ఎండీ అబీబ్, రమేష్, సోమేష్, అశ్విన్, యాదగిరి, చిరంజీవి, సాగర్, రవి, మహేష్, కిరణ్, యాకూబ్ పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



అర్వపల్లి : ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

మద్దిరాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ టెస్ట్‌లో జిల్లా అధికారుల గైడ్‌లైన్స్ ప్రకారం తరగతి వారీగా కాకుండా మొత్తంగా ఎక్కువ మార్కులు సాధించిన తెలుగు మీడియం విభాగంలో డి.అంకితను, ఇంగ్లీష్ మీడియం విభాగంలో సీహెచ్.శ్రావ్యను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఆత్మకూరు (ఎస్) : మండల కేంద్రంలో సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ పరీక్షలో మండలంలోని అన్ని పాఠశాల నుంచి 23మంది విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్షల్లో పాల్గొనగా నలుగురు ఎంపికయ్యారు. వారు జిల్లా స్థాయిలో ఈనెల 21న జరిగే పరీక్షకు హాజరు కానున్నట్లు ధారాసింగ్ తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం ఈ.శంకర్ నాయక్, రంగాచారి, ఉపాధ్యాయులు సుదర్శన్‌రెడ్డి, ఝాన్సీ, సుభాని ఉన్నారు.

అర్వపల్లి : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ (ఎఫ్‌పీఎస్‌టీ) ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ పరీక్షను విద్యార్థులకు ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ పరీక్షకు మండలంలోని అన్ని ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్‌ల విద్యార్థిని విద్యార్థులు హాజరై ఆన్‌లైన్‌లో పరీక్ష రాశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ డి.యల్లయ్య, ఉపాధ్యాయులు వి.మధుకర్, నర్సింగ దుర్గయ్య, కొండ వెంకన్న, మురళికృష్ణ, సూర్య, వెంకటేశ్వర్లు, వేమారెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి విధులకు హాజరు

- సస్పెండ్ చేయాలని డీఈఓకు విద్యార్థి సంఘాల వినతి

సూర్యాపేటటౌన్ : జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి చెందిన ఓ ఉద్యోగి మద్యం సేవించి విధులకు హాజరైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. మద్యం మత్తులో తోటి సిబ్బంది పట్ల అసభ్యంగా మాట్లాడటంతో ఈ విషయం బయటకు వచ్చింది. వివరాల ప్రకారం.. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి రోజు మాదిరిగానే విధులకు హాజరయ్యారు. ఉదయం కార్యాలయానికి మద్యం సేవించి విధులకు హాజరై తోటి ఉద్యోగుల పట్ల అసభ్యంగా, దురుసుగా మాట్లాడారు. దీంతో వారు ఈ విషయాన్ని డీఈఓకు తెలపడంతో డీఈఓ తనవద్దకు రావాలని చెప్పడంతో వెంటనే బయటకు వెళ్లిపోయినట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ విషయమై డీఈఓ అశోక్‌ను వివరణ కోరగా.. అతడి పట్ల కొంత మంది విద్యార్థి సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఎంక్వైరీ చేసి మద్యం సేవించి కార్యాలయానికి వచ్చినట్టు రుజువైతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలి..

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాఘవేంద్రను వెంటనే సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం డీఈఓ కార్యాలయంలో మంగళవారం వారు ఆందోళన చేశారు. అనంతరం డీఈఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ధరావత్ భిక్షా నాయక్, లింగయ్యయాదవ్, అశోక్, బాలునాయక్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

నాగారం : వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య అన్నారు. బీజేపీ భరోసా యాత్రలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలలైందన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నెబోయిన రాముయాదవ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు చలిగంటి వీరేందర్, సాయిబాబు, మాజీ జెడ్పీటీసీ పేరాల పూలమ్మసోమయ్య, చారి, చిరంజీవి, అంజయ్య, సాయిలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్ఎస్

అర్వపల్లి : బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య విమర్శించారు. బీజేపీ భరోసా యాత్రలో భాగంగా మంగళవారం మండలంలోని కాసర్లపహాడ్, అర్వపల్లిలో జరిగిన సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కాపా రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా, మండల అధ్యక్షుడు శంకర్, మాజీ జెడ్పీటీసీ పూలమ్మ, రాములు, శంకర్, శ్రీనివాస్‌నాయక్, అశ్విన్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



అర్వపల్లి : కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రేణుక, జెడ్పీటీసీ వీరప్రసాద్



మద్దిరాల : కంటి పరీక్షలు చేయించుకుంటున్న జెడ్పీటీసీ సురాంభ

అర్వపల్లి : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ కోరారు. మంగళవారం మండలంలోని కాసర్లపహాడ్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కంటి చూపు సమస్య ఉన్నవారు ఉచితంగా అద్దాలు, మందులు పొందాలని సూచించారు. ఈనెల 24వరకు గ్రామంలో కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దబ్బేటి జ్యోతిరాణి, ఎంపీటీసీ బొడ్డు భద్రమ్మరామలింగయ్య, ఎంపీఓ సందీప్‌కుమార్, కంటి వైద్యాధికారి డాక్టర్ చినపాక మణిరత్నం, సీహెచ్ఓ ఎల్.చరణ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరాజు, మెండె సురేష్, ఆప్తమాలజిస్ట్ ఎ.వేణు, ఏఎన్ఎం నాగరాణి, ఉయ్యాల రాము, వేముల గణేష్, హెల్త్ అసిస్టెంట్ కుంభం వీరయ్య, ఎల్. రేణుక, జ్యోతి, హెచ్ఎం యల్లయ్య, వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్దిరాల : కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్, జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్నగౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జి.కొత్తపల్లిలో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అశ్రిత, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, జిలకర్ర చంద్రమౌళి, సర్పంచ్ బొబ్బిలి నర్సమ్మ, ఎంపీటీసీ భూక్య పద్మవీరన్న, ఉప్పలయ్య, డాక్టర్ పర్శానాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టిసారించాలి

ఆత్మకూర్-ఎస్ : వరికి ప్రత్యామ్నాయంగా రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలని మండల ఉద్యానవన శాఖ అధికారి జగన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, ఆయిల్‌పామ్ సాగు చేసిన రైతులకు సబ్సిడీపై డ్రిప్ సౌకర్యం కలదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తంగెళ్ల వీరారెడ్డి, హరీష్, శశీ, చంద్రారెడ్డి, భద్రాచలం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన సార్ల నాగలక్ష్మి ఇటీవల మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబానికి మంగళవారం టీఎంపీఎస్ రాష్ట్ర చైర్మన్ ఈదునూరి సంతోష్‌ముదిరాజ్ రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సార్ల లక్ష్మయ్య, శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

'సమస్యలను బార్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తా'



సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్

చివ్వెంల(సూర్యాపేట) : సూర్యాపేట బార్ అసోషియేషన్ సమస్యలను తెలంగాణ బార్ కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్తానని బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్దన్ అన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో బార్ అసోషియేషన్‌ను పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సమస్యలను న్యాయవాదులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన సమస్యలను బార్ కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారం కోసం కృషిచేస్తానన్నారు. సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు గోండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి సీనపల్లి సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శేషవాహన సేవ



శేషవాహనంపై స్వామి అమ్మవార్లను ఊరేగిస్తున్న అర్చకులు

అర్వపల్లి : మండల కేంద్రలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం అర్ధరాత్రి శేషవాహన సేవను వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను శేషవాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రజలు ఇంటింటికి హారతులిచ్చి పూజలు చేశారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, ఉపసర్పంచ్ ప్రభాకర్, కదారి నరేష్, ఈఓ వై.శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

నేడు పారువేట మహోత్సవం

మండల కేంద్రంలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం (నేడు) పారువేట మహోత్సవం జరగనున్నట్లు జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, దేవాలయ చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, ఈఓ వై. శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరుకు చెందిన జానపద కళాబృందంచే కోలం నృత్యం, నర్సింహస్వామి, కాళికామాతల వేషాధారణ, నృత్యప్రదర్శన, ఆదిలాబాద్ కు చెందిన ఆదివాసి కళాకారులచే గుస్సాడి నృత్యాలు, వరంగల్‌కు చెందిన రేలారే రేలా ఏడుకొండలు బృందంచే మహిళా కళాకారుల డప్పు విన్యాసాలు, యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన మధు బృందంచే ఒగ్గుడోళ్ల ప్రదర్శన, పోతరాజుల విన్యాసాలు ప్రదర్శించబడతాయని తెలిపారు.

మిషన్ భగీరథ నీరు పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం, నాగారం మండలాలకు పదిరోజులుగా నిలిచిపోయిన మిషన్ భగీరథ నీటిని ఎట్టకేలకు మంగళవారం పునరుద్ధరించారు. నిలిచిన 'మిషన్ భగీరథ' నీళ్లు అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. నూతనకల్ మండలం చిల్పకుంట్లలో మిషన్ భగీరథ ప్లాంట్ పంపులు, పైపులు మరమ్మతు చేయించి నీటిని పునరుద్ధరించినట్లు ఏఈఈ అశోక్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

మద్దిరాల : ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో పత్తి దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కుక్కడం గ్రామానికి చెందిన ఊడుగుల యాదగిరి తన ఇంట్లో దాదాపు 15క్వింటాల పత్తిని నిల్వ ఉంచాడు. ఈ క్రమంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ప్రమాదవశాత్తు పత్తికి నిప్పుఅంటుకొని 5క్వింటాలకు పైగా దగ్ధమైనట్లు తెలిపారు.

ఆప్ పట్టణ కోకన్వీనర్‌గా నవీన్

సూర్యాపేట : పట్టణంలో ఆమ్ ఆద్మీ పార్టీ పట్టణ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కోకన్వీనర్‌గా బత్తిని నవీన్‌ను ఎన్నుకున్నట్లు రాజమల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఇన్‌చార్జ్ సూరారపు పరీక్షిత్, జిల్లా అధికార ప్రతినిధి తక్కెళ్లపల్లి శ్యామ్, యూత్ కన్వీనర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

నూతనకల్ : మండల కేంద్రంలో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనుల్లో నాణ్యత లోపంపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యాకూబ్‌కు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి గంటా నాగయ్య, బొడ్డు శంకర్, కునుకుంట్ల సైదులు, కిరణ్, సుమంత్, రమేష్, గోపి పాల్గొన్నారు.

రాజారాం మృతికి నివాళి

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని మామిడాల గ్రామానికి చెందిన దంతాలపల్లి రాజారాం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో మృతదేహాన్ని మంగళవారం వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఏపూరి సోమన్న సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

దేవతామూర్తులకు జలాభిషేకం

నూతనకల్ : మండల పరిధిలోని వెంకెపల్లి గ్రామంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠమహోత్సవం సందర్భంగా దేవతామూర్తులకు మంగళవారం జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామాంజనేయ స్వామి, నవగ్రహాలకు జలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 16న ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ధ్వజ స్తంభానికి జలాభిషేకం

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని ఎండ్లపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామాలయంలో ఈనెల 16న శ్రీరామచంద్ర స్వామి విగ్రహాల ప్రతిష్ఠామహోత్సవంలో భాగంగా మంగళవారం రెండో రోజు ఆలయ ప్రాంగణంలో మూర్తి కుంభ స్థాపన, మూర్తి కుంభ ఆరాధన, సేవాకాలము, ద్వారా తోరణ ధ్వజ, కుంభ ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ధ్వజ స్తంభానికి గ్రామంలోని మహిళలు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సేవలు మరువలేనివి

తుంగతుర్తి : పుల్వామా దాడిలో అమరులైన పోలీసు అమరవీరుల సేవలు మరువలేనివని స్థానిక ఎస్ఐ డానియేల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పుల్వామా దాడిలో అమరులైన పోలీసులకు నివాళులర్పించి, జెడ్పీహెచ్ఎస్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో మానవహారం నిర్వహించి మాట్లాడారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసుల సేవలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాంకోటి, హెచ్ఎం కొండగడ్పుల యాకయ్య, బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములు, సత్యనారాయణ, నాగమల్లు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జవాన్లకు సన్మానం



తిరుమలగిరి : విశ్రాంత జవాన్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఫిబ్రవరి 14న సైనికుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విశ్రాంత జవాన్లను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రామచంద్రంగౌడ్ మాట్లాడుతూ.. భారత సైనికులు దేశరక్షణ కోసం 24గంటలు కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం రిటైర్డ్ జవాన్లు సంకెపల్లి జగన్మోహన్‌రెడ్డి, లింగాచారి, కొండల్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఐలె శ్రీనివాస్, కోశాధికారి సురేష్‌కుమార్, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, కృష్ణమాచారి, దీన్‌దయాళ్ పాల్గొన్నారు.